# దిక్సూచి


सत्यमेव जयते

భారత రాజ్యాంగంలో వివిధ పదవులు, అర్హతలు, పదవీకాలం, జీతభత్యాలు, తొలగింపు, కనీస, గరిష్ఠ వయస్సులు, పదవీ విరమణ వయస్సుకు సంబంధించిన ప్రాథమిక సమాచారంపై దాదాపు 10-15 ప్రశ్నలు వివిధ పోటీ పరీక్షల్లో వస్తున్నాయి. వీటిని చదివి గుర్తుంచుకొనేందుకు మూడు వారాలుగా చక్కటి మెమొరీ టెక్నిక్స్, షార్ట్‌కట్స్ అందించాం. ఈ పర్యాయం రాజ్యాంగంలోని విస్తృతమైన సమాచారాన్ని సులభంగా చదివి గుర్తుంచుకోవడానికి వీలుగా కింది పద్ధతిలో అందిస్తున్నాం. ఇది అభ్యర్థులకు ఒక 'రెడీ రికనర్'గా ఉపయోగపడుతుంది. ఇండియన్ పాలిటీలో దీనిని గుర్తుంచుకుంటే 25 మార్కులకు 15 మార్కులు గ్యారంటీగా సాధించవచ్చు.


బి. కృష్ణారెడ్డి
bkreddygongati@gmail.com
Ph:9959361278




## సివిల్స్ / గ్రూప్- 1, 2 - జేఎల్ / డీఎల్ గైడెన్స్

# ఇండియన్ పాలిటీ మేడ్ ఈజీ

### రాష్ట్రపతి


ప్రతిభా పాటిల్

**రాజ్యాంగ ప్రకరణ:** 52-62
**అర్హతలు:** కనిష్ఠంగా 35 సంవత్సరాలు నిండి ఉండాలి. గరిష్ఠ వయస్సు పరిమితి లేదు.
**పదవీకాలం:** 5 సంవత్సరాలు
**పదవీ విరమణ వయస్సు:** లేదు
**జీతభత్యాలు:** నెలకు రూ.1,50,000
**తొలగింపు విధానం:** మహాభియోగ తీర్మానం (ప్రకరణ 61) రాజ్యాంగ ఉల్లంఘన అనే ఏకైక కారణం. ఉభయ సభల్లో 2/3 వంతు మెజారిటీతో ఆమోదించాలి.
**రాజీనామా సంబోధన:** ఉపరాష్ట్రపతి
**పదవి ప్రత్యేకతలు:** దేశాధిపతి, రాజ్యాంగపరమైన అధిపతి, కేంద్ర కార్యనిర్వాహక అధిపతి, చట్టపరమైన అధిపతి, నామ మాత్ర అధిపతి.

### ఉప రాష్ట్రపతి


హమీద్ అన్సారి

**రాజ్యాంగ ప్రకరణ:** 63-70
**అర్హతలు:** కనిష్ఠంగా 35 సంవత్సరాలు నిండి ఉండాలి. గరిష్ఠ వయస్సు పరిమితి లేదు.
**పదవీకాలం:** ఐదు సంవత్సరాలు
**పదవీ విరమణ వయస్సు:** లేదు
**జీతభత్యాలు:** నెలకు రూ. 1,40,000 (రాజ్యసభ చైర్మన్ హోదాలో)
**తొలగింపు విధానం:** మహాభియోగ తీర్మానం అవసరం లేదు. తొలగించే తీర్మానాన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టాలి. ఉభయ సభలు మెజారిటీ తీర్మానం ద్వారా తొలగించవచ్చు.
**రాజీనామా సంబోధన:** రాష్ట్రపతికి
**పదవి ప్రత్యేకతలు:** హోదారీత్యా రాజ్యసభకు అధ్యక్షునిగా వ్యవహరిస్తారు. రెండో అత్యున్నతమైన పదవి.

### ప్రధానమంత్రి / మంత్రిమండలి


మన్మోహన్‌సింగ్

**రాజ్యాంగ ప్రకరణ:** 74-75
**అర్హతలు:** కనిష్ఠంగా 25 సంవత్సరాలు. గరిష్ఠ వయస్సు పరిమితి లేదు.
**పదవీకాలం:** ఐదు సంవత్సరాలు (సాధారణంగా) లేదా (లోక్‌సభ విశ్వాసం)
**పదవీ విరమణ వయస్సు:** లేదు
**జీతభత్యాలు:** నెలకు రూ. 1,20,000 (ఇతర అన్ని అలవెన్సులు కలుపుకొని)
**తొలగింపు విధానం:** లోక్‌సభ అవిశ్వాస తీర్మానం ద్వారా తొలగిస్తుంది. మంత్రులను మాత్రం ప్రధాని సలహా మేరకు రాష్ట్రపతి తొలగిస్తారు.
**రాజీనామా సంబోధన:** రాష్ట్రపతికి
**పదవి ప్రత్యేకతలు:** ప్రధాని ప్రభుత్వాధిపతి. మంత్రిమండలికి అధ్యక్షుడు. వాస్తవ కార్యనిర్వాహక అధిపతి. ప్రణాళికా సంఘానికి, జాతీయ అభివృద్ధి మండలికి, జాతీయ సమగ్రతా మండలికి, అంతర్‌రాష్ట్రమండలికి హోదా రీత్యా అధ్యక్షునిగా వ్యవహరిస్తారు.

### గవర్నర్


ఎన్.డి.తివారీ

**రాజ్యాంగ ప్రకరణ:** 152-162
**అర్హతలు:** కనిష్ఠంగా 35 సంవత్సరాలు నిండి ఉండాలి. గరిష్ఠ వయస్సు పరిమితి లేదు.
**పదవీకాలం:** 5 సంవత్సరాలు కాని (రాష్ట్రపతి విశ్వాసం ఉన్నంత వరకు పదవిలో ఉంటారు)
**పదవీ విరమణ వయస్సు:** లేదు
**జీతభత్యాలు:** నెలకు రూ.1,10,000
**తొలగింపు విధానం:** రాష్ట్రపతి తొలగిస్తారు. అభిశంసన అవసరం లేదు. ప్రత్యేక కారణాలు రాజ్యాంగంలో ప్రస్తావించలేదు.
**రాజీనామా సంబోధన:** రాష్ట్రపతికి
**పదవి ప్రత్యేకతలు:** రాష్ట్రంలో కేంద్రప్రభుత్వ ప్రతినిధి. రాష్ట్రాధిపతి. రాష్ట్రంలో పాలన ఈయన పేరుతోనే ఉంటుంది.

### సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి / ఇతర న్యాయమూర్తులు


కె.జి.బాలక్రిష్ణన్

**రాజ్యాంగ ప్రకరణ:** 124-147
**అర్హతలు:** కనిష్ఠంగా పరిమితి లేదు. గరిష్ఠ వయస్సు 65 సంవత్సరాలు.
**పదవీకాలం:** ఉండదు.
**పదవీ విరమణ వయస్సు:** 65 సంవత్సరాలు
**జీతభత్యాలు:** నెలకు రూ. 1,00,000 (ప్రధాన న్యాయమూర్తి) రూ. 90,000 (ఇతర న్యాయమూర్తులు)
**తొలగింపు విధానం:** అవినీతి, అసమర్థత కారణంగా పార్లమెంటు ఉభయ సభలు ప్రత్యేక మెజారిటీతో అభిశంసన తీర్మానం చేస్తే రాష్ట్రపతి తొలగిస్తారు.
**రాజీనామా సంబోధన:** రాష్ట్రపతికి
**పదవి ప్రత్యేకతలు:** సుప్రీంకోర్టుకు మరో పేరు ఫెడరల్ కోర్టు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 1+30గా నిర్ణయించారు. భారత సుప్రీంకోర్టు ప్రపంచ దేశాల సుప్రీంకోర్టులతో పోలిస్తే అత్యంత శక్తిమంతమైన వాటిలో రెండోది. (మొదటిది అమెరికా సుప్రీంకోర్టు).

### హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి / ఇతర న్యాయమూర్తులు


ఎ.ఆర్.దవె

**రాజ్యాంగ ప్రకరణ:** 124 నుంచి 231
**అర్హతలు:** కనిష్ఠ పరిమితి లేదు. గరిష్ఠ వయస్సు 62 సంవత్సరాలు.
**పదవీకాలం:** ఉండదు
**పదవీ విరమణ వయస్సు:** 62 సంవత్సరాలు
**జీతభత్యాలు:** నెలకు రూ. 90,000 (ప్రధాన న్యాయమూర్తి) రూ.80,000 (ఇతర న్యాయమూర్తులు)
**తొలగింపు విధానం:** సుప్రీంకోర్టు న్యాయమూర్తులను తొలగించే విధానాన్నే ఇక్కడ ఉపయోగిస్తారు.
**రాజీనామా సంబోధన:** రాష్ట్రపతికి
**పదవి ప్రత్యేకతలు:** రాష్ట్ర హైకోర్టుకు బెంచీలు ఉంటాయి. అత్యధిక బెంచీలున్న హైకోర్టు గౌహతి హైకోర్టు (నాలుగు బెంచీలు). అలాగే ముంబయి హైకోర్టు (మూడు బెంచీలు).

### ముఖ్యమంత్రి / మంత్రిమండలి


కె.రోశయ్య

**రాజ్యాంగ ప్రకరణ:** 163-164
**అర్హతలు:** కనిష్ఠంగా 25 సంవత్సరాలు. గరిష్ఠ వయస్సు లేదు.
**పదవీకాలం:** 5 సంవత్సరాలు కానీ, విధానసభ విశ్వాసం ఉన్నంత వరకు
**పదవీ విరమణ వయస్సు:** లేదు
**జీతభత్యాలు:** నెలకు రూ. 75,000 (అన్ని అలవెన్సులతో)
**తొలగింపు విధానం:** గవర్నర్ బర్తరఫ్ చేయవచ్చు. లేదా విధానసభ అవిశ్వాస తీర్మానం ద్వారా తొలగిస్తుంది.
**రాజీనామా సంబోధన:** గవర్నర్
**పదవి ప్రత్యేకతలు:** రాష్ట్ర ప్రభుత్వాధిపతి. మంత్రి మండలికి అధ్యక్షుడు. రాష్ట్ర ప్రణాళికా సంఘానికి కూడా అధ్యక్షునిగా వ్యవహరిస్తారు.

**(వచ్చేవారం మరికొన్ని)**

## డ్రీమ్ స్పార్క్ ప్రోగ్రాం

అత్యంత ప్రతిష్ఠాత్మక 'మైక్రోసాఫ్ట్' కంపెనీతో రాష్ట్రంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూ) తన విద్యార్థులకు ఉపయుక్తమయ్యే రీతిలో ఇటీవల 'డ్రీమ్ స్పార్క్ ప్రోగ్రాం' పేరిట ఒక ఒప్పందం కుదుర్చుకొంది. తద్వారా జెఎన్‌టీయూకు అనుబంధంగా ఉన్న 380 కళాశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న మూడు లక్షల మంది విద్యార్థులు ఇక తాజా మైక్రోసాఫ్ట్ డెవలపర్, డిజైనర్ టూల్స్‌ను ఉచితంగా వినియోగించుకోవచ్చు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు విజయం దిశగా పయనించేందుకు సమాచార సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన తాజా టూల్స్ అవసరం ఎంతో ఉంది. ఆ దిశలో మైక్రోసాఫ్ట్ అందించే తాజా సమాచార సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులకు విలువైన ప్రయోజనాన్ని చేకూరుస్తుందని యూనివర్సిటీ అధికార వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

ఈ ఒప్పందం మేరకు గణితం, సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, డిజైనింగ్ విభాగాలకు చెందిన విద్యార్థులకు అకడమిక్ సాఫ్ట్‌వేర్ లైసెన్స్‌లు ఉచితంగా అందుతాయి. 'ఏ దేశ సామాజిక, ఆర్థిక పురోభివృద్ధికైనా విద్యా రంగం ఎంతగానో దోహదపడుతుందని మైక్రోసాఫ్ట్ బలంగా విశ్వసిస్తోంది. ఆ దిశలో నూతన తరానికి సాంకేతిక పరిజ్ఞానం అందించడం లక్ష్యంగా పెట్టుకొన్నాం. అందుకే విద్యార్థులకు ఉపయుక్తమయ్యే రీతిలో ప్రొఫెషనల్స్ స్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని డ్రీమ్ స్పార్క్ ప్రోగ్రాం పేరిట అందిస్తున్నాం' అని మైక్రోసాఫ్ట్ వర్గాలు తెలిపాయి.

## యంగ్ అచీవర్స్ అవార్డ్స్

విద్యా రంగంలో విశేష సేవలందిస్తోన్న పోర్టల్స్ www.globalscholor.com, education-world 'యంగ్ అచీవర్స్ అవార్డ్స్-2009' కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. దేశవ్యాప్తంగా 12 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్కులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు అవార్డులను ఉద్దేశించారు. సైన్స్-మేథ్స్, టెక్నాలజీ, ఆర్ట్స్ అండ్ మ్యూజిక్, సోషల్ వర్క్, స్పోర్ట్స్ విభాగాల్లో దరఖాస్తులను కోరుతోంది. వాటిని www.globalscholor.com/yaa నుంచి గానీ లేదా educationworldonline.net నుంచి గానీ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తులను డిసెంబర్ 12లోగా పంపించాలి.

యువ విద్యార్థులు తమ ఆలోచనలను, విజయాలను ఆవిష్కరించే వేదికగా ఉపయోగించుకొనే ఉద్దేశంతో ఈ అవార్డులను అందిస్తున్నారు. నూతన ఆలోచనలు, ఆవిష్కరణలు కలిగిన యువ విద్యార్థులకు దేశంలో కొదువలేదని.. అలాంటి వారు మిగతా విద్యార్థులకు, చిన్నారులకు స్ఫూర్తిమంతంగా నిలుస్తారని భావిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ వడబోతల అనంతరం ఎనిమిది రంగాల్లో విద్యార్థులను ఎంపిక చేస్తారు. అందు కోసం అభ్యర్థుల ప్రతిభను, మూర్తిమత్వాన్ని ఎడ్యుకేషన్ వరల్డ్ జ్యూరీ పరిశీలిస్తుంది. అంతిమంగా ఒక్కో రంగం నుంచి ఒక్కో విద్యార్థిని ఎంపిక చేస్తుంది. వారికి ముంబయిలో జరిగే కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేస్తారు. అవార్డు గ్రహీతలకు వివిధ బహుమానాలు లభిస్తాయి.

## వివరాలు ఇవిగో

### బ్యూటీ కేర్ బెస్టేనా?

❍ **నేను సెకండియర్ ఇంటర్ చదువుతున్నాను. బ్యూటీ కేర్‌పై ఆసక్తి ఉంది. అయితే ఇందులో అవకాశాలు ఉన్నాయా?**

**- కె.దివ్య భారతి, వరంగల్**

✎ బ్యూటీ కేర్‌లో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయి. వృత్తిపరంగా ఎదుగుదల ఉంటుంది. అలాగే స్పెషలైజేషన్ కూడా చేసుకుని ముందుకు సాగవచ్చు. మొదటగా సొంతంగా ఈ రంగంలో నిలదొక్కుకోవచ్చు. బ్యూటీ క్లినిక్ పెట్టుకోవచ్చు. బ్యూటీ సెలూన్, హెల్త్ క్లబ్ తదితరాలను నిర్వహించుకోవచ్చు. సొంతంగా రిస్క్ అని భావిస్తే, వాటిలో బ్యూటీ థెరపిస్టుగా, డే స్పాస్‌గా పనిచేయవచ్చు. మాష్యూర్, బ్యూటీ కన్సల్టెంట్/ అడ్వయిజర్‌గా ఉండొచ్చు. మేకప్ ఆర్టిస్ట్, హెయిర్ స్టయిలిస్ట్, హెయిర్ కలరిస్ట్‌గా మారవచ్చు. ఇవి కాకుండా కాస్మొటిక్ కంపెనీల్లో ప్రొడక్ట్ కన్సల్టెంట్, బ్యూటీ స్కూళ్ళలో టీచర్‌గానూ కొనసాగవచ్చు.



ఫ్యాషన్ పరిశ్రమ, అడ్వర్టయిజింగ్, టీవీ సంస్థలు కూడా వీరి సేవలను తీసుకుంటాయి. అక్కడ కూడా నిపుణులైన మేకప్ ఆర్టిస్ట్, హెయిర్ స్టయిలిస్ట్‌గా పనిచేయవచ్చు. మేకప్‌లో కూడా ప్రత్యేకించి నవ వధువుల కోసం అలాగే టీవీ, ఫిల్మ్, థియేటర్, స్టిల్ ఫొటోగ్రఫీ, ర్యాంప్ మోడలింగ్‌ను ఎంపిక చేసుకోవచ్చు. సాధారణంగా ఈ రంగంలో డిప్లొమా అనంతరం స్పెషలైజేషన్ చేసే వీలుంటుంది. మేకప్, హెయిస్టయిలింగ్, మసాజ్, నెయిల్ ఆర్ట్, స్పా ట్రీట్‌మెంట్, సంప్రదాయ ఆయుర్వేద ట్రీట్‌మెంట్, ఆరోమథెరపి, లేసర్ లేదా ఎలక్ట్రోలసిస్ తదితరాలను చేయవచ్చు. ఆరంభంలో అయిదు నుంచి పదివేల రూపాయల పొందవచ్చు. అనుభవంతో మరింత మొత్తాలను అందుకోవచ్చు. ప్రకటనలకు ఉద్దేశించి ప్రచార కార్యక్రమాలు, మోడలింగ్, షూటింగ్ కార్యక్రమాల్లో మేకప్ ఆర్టిస్టులుగా, హెయిర్ స్టయిలిస్టులుగా పాల్గొంటే రోజుకు పదిహేను వందల నుంచి మూడు వేల రూపాయాలు పొందవచ్చు. ఇదంతా అనుభవాన్ని బట్టి ఉంటుంది. పేరొందిన బ్యూటీ సెలూన్లలో మేనేజర్ అంటే కార్పొరేట్ సంస్థల్లో మాదిరిగా వేతనాలు అందుకోవచ్చు.

### పొలిటికల్ సైన్స్‌లో..

❍ **పొలిటికల్ సైన్స్‌లో బిఎ ఆనర్స్ చేస్తున్నాను. ఇంటర్నేషనల్ రిలేషన్స్‌లో ఎమ్మే చేయాలనుకుంటున్నాను. అవకాశాలు ఎలా ఉంటాయంటారు?**

**- పి.నాగరాజారావు, తెనాలి**

✎ పొలిటికల్ సైన్స్, ఇంటర్నేషనల్ రిలేషన్స్‌లో కాలేజీ/ యూనివర్సిటీ స్థాయిలో అధ్యాపకుడిగా చేరవచ్చు. సివిల్స్ పరీక్షలకు హాజరుకావచ్చు. ప్రత్యేకించి ఫారిన్ సర్వీస్ ఎంపిక చేసుకోవచ్చు. బాగా రాయగలిగితే మీడియాలో అనలిస్ట్‌గా చేరవచ్చు. అలాగే టీవీలో పని చేయవచ్చు. సంబంధిత వెబ్‌సైట్‌లలోనూ పనిచేయవచ్చు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పీస్ అండ్ కాన్‌ఫ్లిక్ట్ రిజల్యూషన్ అండ్ ఇంటర్నేషనల్ సెంటర్ తదితరాల్లో పరిశోధన చేపట్టవచ్చు.

### ఆర్కియాలజీలో..

❍ **హిస్టరీతో బిఎ చదువుతున్నాను. ఆర్కియాలజీపై ఆసక్తి ఇటీవలికాలంలో పెరిగింది. పీజీలో ఆర్కియాలజీని అందించే యూనివర్సిటీ పేర్లు తెలియండి. అదేవిధంగా దీనిలో అవకాశాలూ చెప్పండి.**

**- కె. శాంత, కడప**

✎ మనుగడలో లేని సమాజాలు అలాగే ప్రస్తుతం ఉన్న వాటి గతం తదితరాలను ఒక పద్ధతి ప్రకారం అధ్యయనం చేసే శాస్త్రమే ఆర్కియాలజీ. ఇందుకోసం ఉద్దేశించిన తవ్వకాలతో మొదలుకుని వివిధ మార్గాల్లో సమాచార సేకరణ, మూల్యాంకన, నిర్ధారణ సైతం ఈ శాస్త్ర పరిధిలోకే వస్తాయి. ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఎస్ఐ) మన దేశానికి సంబంధించి ఆయా పనులను పర్యవేక్షిస్తోంది. ఇదే కాకుండా ఈ కోర్సు చేసిన వ్యక్తులు మ్యూజియాలు, పరిశోధన సంస్థలు, పర్యాటక పరిశ్రమలో ఉపాధి పొందవచ్చు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ కల్చరల్ రీసెర్చ్, ద ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ వంటివి కూడా ఆర్కియాలజీ సంబంధ వ్యాపకాలను నిర్వర్తిస్తాయి. ప్రైవేటుగా ఈ పనుల్లో ఉండే వారు కూడా ఆర్కియాలజిస్టుల సేవలను తీసుకుంటారు. హెరిటేజ్ మేనేజ్‌మెంట్, క్యురేటింగ్ అండ్ అకడమిక్స్‌కు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి లభిస్తుంది. బోధన అలాగే ప్రజల్లో సంబంధిత అవగాహన పెంచడం వంటివి సైతం చేపట్టవచ్చు. ఇందులోనూ స్పెషలైజేషన్లు ఉన్నాయి. ఎపిగ్రఫి అంటే ప్రాచీన శాసనాల్లోని లిపి/ భాషను అర్థం చేసుకునే ప్రక్రియ; చాలా కాలం నాటి నాణాలు, పతకాల అధ్యయనం ద్వారా చరిత్ర నిర్మాణం - న్యూమిస్‌మాటిక్స్; పురాతన కట్టడాల పరిరక్షణ తదితరాలను ఇందులో స్పెషలైజేషన్లుగా పేర్కొనవచ్చు. మన రాష్ట్రంలోని కొన్ని విశ్వవిద్యాలయాలతోపాటు భోపాల్‌లోని భర్కతుల్లా విశ్వవిద్యాలయం, వారణాసిలోని బెనారస్ హిందూ యూనివర్సిటీ, కురుక్షేత్రలోని కురుక్షేత్ర యూనివర్సిటీ, ఢిల్లీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెరిటేజ్ రీసెర్చ్ అండ్ మేనేజ్‌మెంట్‌ల్లో ఆర్కియాలజీని పీజీ కోర్సుగా అందిస్తున్నాయి. మాస్టర్స్ ఇన్ ఆర్కియాలజీ/ హెరిటేజ్ మేనేజ్‌మెంట్/ కన్సర్వేషన్/ ప్రిజర్వేషన్ అండ్ హెరిటేజ్ మేనేజ్‌మెంట్ పేర ఈ కోర్సులు ఉన్నాయి. హ్యుమానిటీస్/ సైన్స్‌లో డిగ్రీ ఉత్తీర్ణులు ఈ కోర్సులు చేయవచ్చు.



ఎఎస్ఐకి చెందిన ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్కియాలజీ పీజీ డిప్లొమా ఇన్ ఆర్కియాలజీని అందిస్తోంది.

**- గోవర్ధనం కిరణ్‌కుమార్**

చిరునామా: **వివరాలు ఇవిగో,** కేరాఫ్ ఎడ్యుకేషన్ డెస్క్, ఆంధ్రజ్యోతి, ప్లాట్ నెం.76, రోడ్ నెం.70, అశ్వినీ ఎన్‌క్లేవ్, హుడాహైట్స్, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500 033

## గ్రూప్- 1 స్క్రీనింగ్ టెస్ట్

### భారత ఆర్థిక వ్యవస్థ

# గ్రామీణాభివృద్ధి పథకాలు


డాక్టర్ టి.సాయిలు

గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పించడానికి లేదా గ్రామీణ ప్రజలకు ఉపాధిని కల్పించి వారి జీవన ప్రమాణాలను పెంచడం కోసం అమలు జరిపే పథకాలను గ్రామీణాభివృద్ధి పథకాలు అంటారు.

### కరువు ప్రాంతాల కార్యక్రమం (డిపిఎపి)

డిపిఎపిని 1973లో ప్రారంభించారు. ఈ పథకం అమలు కోసం జరిగే వ్యయాన్ని కేంద్ర, రాష్ట్రాలు 75:25 నిష్పత్తిలో భరిస్తాయి. కరువు ద్వారా ఉత్పన్నమయ్యే నష్టాన్ని సాధ్యమైనంత మేరకు నిరోధించేవిధంగా సాంకేతిక పద్ధతులను పాటించడం ఈ పథకం వ్యూహం. భూసారాన్ని, నీటిని, సహజ వనరులను వర్షపు నీటిని సాధ్యమైనంత మేరకు పరిరక్షిస్తూ దీర్ఘకాలిక పర్యావరణ సమతుల్యతను కాపాడేవిధంగా కార్యక్రమాలు ఉంటాయి.

1995-96 నుంచి ఈ కార్యక్రమం ఆచార్య హనుమంతరావ్ కమిటీ సిఫార్సుల మేరకు 'వాటర్ షెడ్ ప్రాజెక్టు' ఆధారంగా అమలు జరుగుతున్నది. ప్రతి వాటర్ షెడ్ ప్రాజెక్టు నాలుగు సంవత్సరాల కాల పరిమితి, 500 హెక్టార్లను యూనిట్‌గా కలిగి ఉంటుంది. ఆ ప్రాంతపు గ్రామాల ప్రజల వాటర్‌షెడ్ సంఘం ఈ ప్రాజెక్టును రూపొందించి అమలుపరిచే బాధ్యతను కలిగి ఉంటుంది.

**ప్రత్యేక తరగతులు**
1. షెడ్యూల్డ్ కులాలు
2. షెడ్యూల్డ్ జాతులు
3. వెనుకబడిన తరగతులు
4. మైనారిటీలు
5. మహిళలు
6. వికలాంగులు
7. పదవీ విరమణ చేసిన సైనిక ఉద్యోగులు (ఎక్స్ సర్వీస్‌మెన్)

### ఎడారి అభివృద్ధి కార్యక్రమం (డిడిపి)

1977-78 లో ఈ కార్యక్రమం ఆరంభమైంది. ఈ పథక వ్యూహం, లక్ష్యాలు డిపిఎపి లాంటిదే. ఈ పథకం కూడా వాటర్ షెడ్ ఆధారంగా అమలుజరుగుతుంది. అయితే ఇసుక ప్రాంతాల్లో వాటర్‌షెడ్ యూనిట్‌ను తీసుకునే అవకాశం లేనప్పుడు కొన్ని గ్రామాలను యూనిట్లుగా చేపడతారు.1994-95 వరకు ఈ కార్యక్రమం నూరుశాతం కేంద్ర నిధులతో నడిచింది. ప్రస్తుతం ఈ పథకానికయ్యే వ్యయాన్ని కేంద్ర, రాష్ట్రాలు 75:25 నిష్పత్తిలో భరిస్తున్నాయి.

### సమగ్ర బంజరు భూముల అభివృద్ధి పథకం (ఇడబ్ల్యుడిపి)

ఈ పథకాన్ని 1988-89 నుంచి నూరుశాతం కేంద్రప్రభుత్వ నిధులతో అమలుచేస్తున్నారు. నిధులను కేంద్ర బంజరు భూముల అభివృద్ధి బోర్డు విడుదల చేస్తుంది. గ్రామస్థాయిలో లేదా సూక్ష్మ వాటర్‌షెడ్ స్థాయిలో భూ యాజమాన్యాన్ని, బంజరు భూములను అభివృద్ధి పరచడానికి సమగ్ర విధానాన్ని అమలుపరుస్తారు.

### పార్లమెంటు సభ్యుల స్థానిక ప్రాంతాల అభివృద్ధి పథకం (ఎంపిఎల్ఎడిఎస్)

అయితే 1993లో ఈ పథకం ఆరంభమైంది. స్థానిక అవసరాలను దృష్టిలో పెట్టుకొని పార్లమెంట్ సభ్యుని సిఫార్సుల మేరకు సామూహిక అవస్థాపన సౌకర్యాలు అభివృద్ధి పర్చడం ఈ పథక ఉద్దేశం. ఈ పథకం కింద ప్రతి పార్లమెంటు సభ్యుడికి ప్రతి సంవత్సరం రూ.2 కోట్లు ఇస్తారు. రక్షిత మంచినీరు, విద్య, ప్రజావైద్యం, షెడ్యూల్డ్ కులాలు, తెగల అభివృద్ధి మొదలైనవి ప్రాధాన్యం గల అంశాలు.

ట్రస్టులు లేదా సొసైటీలు చేపట్టే అభివృద్ధి పనికి రూ.25 లక్షలు గరిష్ఠ పరిమితిగా ఉంటుంది. నిధుల్లో కనీసం 15 శాతం షెడ్యూల్డ్ కులాలు నివాసం ఉన్న ప్రాంతాల్లో, 7.5 శాతం నిధులు షెడ్యూల్డ్ తెగలు నివాసముంటున్న ప్రాంతాల్లో ఖర్చుచేయాలి.

### ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన (పిఎంఆర్‌వై)

చదువుకున్న గ్రామీణ యువతకు స్వయంఉపాధిని కల్పించడానికి 1993లో ఈ పథకం ఆరంభమైంది. ఉత్పత్తి, సేవలు, వ్యాపారం మొదలైన వాటిలో సూక్ష్మ సంస్థల స్థాపనకు ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులైన గ్రామీణ యువతకు సబ్సిడీతో కూడిన రుణాన్ని అందించి వారు స్వయంఉపాధిని పొందేలా చూడటం ఈ పథక లక్ష్యం. పిఎంఆర్‌వైని 2008 నుంచి ప్రధానమంత్రి ఉపాధి సృష్టి కార్యక్రమం (పిఎంఇజిపి)గా మార్చారు. రాష్ట్రస్థాయిలో ఖాదీ, గ్రామీణ పరిశ్రమల బోర్డులు జిల్లాస్థాయిలో జిల్లా పారిశ్రామిక కేంద్రాలు కమిషన్‌కు సహకరిస్తాయి.

పిఎంఇజిపి కింద ఉత్పత్తి సంస్థకు గరిష్ఠంగా రూ.25 లక్షలు, సేవల సంస్థలకు రూ.10లక్షలు పెట్టుబడిగా నిర్ణయించారు. ప్రాజెక్టు వ్యయంలో సాధారణ ప్రయోజకులు 10 శాతాన్ని, ప్రత్యేక తరగతుల ప్రయోజకులు 5 శాతాన్ని భరించాలి. మిగతా భాగం బ్యాంకుల ద్వారా రుణం అందేలా చూస్తారు. ప్రాజెక్టు వ్యయంలో గ్రామీణ ప్రాంతాల సాధారణ ప్రయోజకులు 25 శాతం సబ్సిడీని గ్రామీణ ప్రాంతాల ప్రత్యేక తరగతుల వారు 35 శాతం సబ్సిడీని పొందుతారు 18 సంవత్సరాలు నిండి ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులైన వారికి, స్వయం సహాయ బృందాలకు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందడానికి అర్హత ఉంటుంది.



### చుక్కాని


చుక్కా రామయ్య

# బాలల చదువే దేశానికి ప్రాణం

ఇటీవల ఒబామా టీవీలో తన దేశ విద్యా విధానంపై గంటన్నర సమయం మాట్లాడారు. దీనిపై ఏం చేయాలని మా కిరణ్ అడిగాడు. జ్ఞానయుగంలో అమెరికన్ అధ్యక్షునిగా తన దేశంలో విద్యారంగానికి, ఆర్థిక రంగానికి ఉన్న సన్నిహిత సంబంధాన్ని తన దేశ ప్రజల ముందుంచాడు. అతని ఉపన్యాసం అమెరికన్ ప్రజలకే కాదు, యావత్ ప్రపంచానికి. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఉపయోగపడుతుంది. అమెరికా అధ్యక్షునిగానే కాకుండా ఒక ఆఫ్రో అమెరికన్ తెగలలో బాధలను అనుభవించిన వ్యక్తి నుంచి వచ్చిన మాటలుగా గుర్తించాలి.

ఒబామా ఉపన్యాసంలో మొదటి వాక్యం ఏమిటంటే, శిశు విద్యపై నేను ఎక్కువ డబ్బు వెచ్చించదల్చుకున్నాను. అందుకోసం నవీన ఉపాధ్యాయులను నియమిస్తాను. ఆర్మీలా ఆ ఉపాధ్యాయ సైన్యాన్ని నియమించాలనుకుంటున్నాను. వారికి ఎక్కువ జీతాలు ఇస్తాను. వారికి అండగా నిలుస్తాను. వారి నుంచి ఉత్తమ ప్రమాణాలను కోరుతాను. చదువులో నాణ్యత, జవాబుదారీతనం కోరుతాను. ఇది నేను అత్యవసరంగా చేయాల్సిన పని అన్నారు.

నా ప్రాధాన్యం ఏమిటంటే ఆ పిల్లలపై చదువుల కోసం డబ్బు ఖర్చు పెడతాను. వారిపై డబ్బు ఖర్చు చేయడం వల్ల నా దేశ అభివృద్ధి అనే కొత్త భవాలను నిర్మించిన వాడినవుతాను. నా దేశ ఆర్థిక పరిస్థితి బాగుపడుతుంది. ఒక్క డాలర్ ఖర్చు చేస్తే నాకు 7 నుంచి 10 డాలర్ల ప్రత్యామ్నాయం దొరుకుతుంది. దానివల్ల ఎంప్లాయ్‌మెంట్ పెరుగుతుంది. హయ్యర్ గ్రాడ్యుయేషన్‌లో ఉత్తమమైన విద్యార్థులు వస్తారు. దేశంలో క్రైం రేటు పడిపోతుంది. సంక్షేమ కార్యక్రమాలకు డబ్బు తగ్గుతుంది. వైద్య సౌకర్యాలు పెరుగుతాయి. ఈ పిల్లలే దేశ ప్రగతి రథ చక్రాలు. చిన్నపిల్లల చదువుపై, ప్రీ-ప్రైమరీ విద్యకే ఎక్కువ డబ్బు వినియోగించాలనుకుంటున్నాను. ప్రతిరోజు నా పిల్లలకు 20 నిమిషాలు మాత్రమే సైన్స్ సబ్జెక్టు చెబుతున్నారు. జీవితంలో 80 శాతం సమయమంతా సైన్స్, మేథ్స్‌కు సంబంధించిన పనులపై కేటాయించాల్సి ఉంది. ఇది ఉపాధి కోసం మాత్రమే కాదని ఆరోగ్యకరమైన వ్యక్తిగా ఉండేందుకు, ఉత్తమ పౌరునిగా ఎదిగేందుకు అవసరమన్నాడు.

అభివృద్ధి చెందిన 40 దేశాల్లో సైన్స్, మేథ్స్‌లో అధ్యయనం చేస్తే అమెరికాది గణితంలో 21వ ర్యాంకుగా ఉంది. సైన్స్‌లో 19వ ర్యాంకు అయ్యింది. దేశం దినదినం దిగజారిపోతున్నది. ఈ నాలుగు సంవత్సరాల్లో సైన్స్, మేథ్స్‌లో ప్రథమ స్థానానికి తీసుకువెళ్లడమే లక్ష్యమన్నారు. ఇండియా నుంచి అమెరికా వెళ్లిన బ్యాక్‌గ్రౌండ్ వేరు. కానీ ఒబామా వారిని చూసి నిరుత్సాహపడుతున్నారు. కానీ మన దేశంలో 'క్రీమ్' అక్కడికి వెళ్లింది. మన దేశ ప్రాథమిక విద్యలో మన రాష్ట్రం 27వ స్థానంలో ఉంది. మన పిల్లలు సైన్స్‌లో కాదు తెలుగులో పట్టుమని పది వాక్యాలు రాయలేకపోతున్నారు. ఇది బాధాకరం. ప్రాథమిక విద్యలో మరింత కృషి చేయాల్సి ఉంది. ప్రాథమిక విద్యను జాతీయం చేయాలి. ఇది జాతీయ ఆస్తి. విద్య అనే చెట్టు పెరగాలంటే వేర్లకు నీళ్లందాలి. ఒబామా తన దేశ ప్రజలకు ఏమి చెబుతున్నాడో చూస్తే మనం ఏం చేస్తున్నామో తెలిసిపోతుంది.